పైపులైన్ వేశారు.. రోడ్డెప్పుడు వేస్తారు?







10 నెలలుగా రోడ్డు నిర్మించడంలో తీవ్ర జాప్యం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో జనాభాకు అనుగుణంగా అధికారులు కొత్త పైపులైన్లను వేశారు. కానీ తిరిగి రోడ్లను నిర్మించడం మరిచారు. ఇక్కడ రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ సమస్య మైసమ్మనగర్, అంజయ్యనగర్, కూన మహాలక్ష్మీనగర్‌లలో, జగద్గిరినగర్, షిరిడీహిల్స్, సీసాల బస్తీ, శివనగర్, రింగ్ బస్తీలలో ఎక్కువగా ఉంది. ఇక్కడ డ్రైనేజీ పనులు పూర్తి చేసి సుమారు 8 నుంచి 10 నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు మాత్రం ప్రారంభించలేదు. అసలే వర్షాకాలం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపూ గాజులరామారం ఏఈ తిరుపతిని వివరణ కోరగా డివిజన్ పరిధిలో 22 పనులకు ప్రతిపాదనలు పంపామని.. వచ్చే నెలలో అన్ని పనులు మొదలు పెట్టడానికి ప్రయత్నిస్తామని తెలిపారు.

వ్యర్థాల పారబోత.. మూగజీవాల మృత్యుఘోష!

దుండిగల్: రసాయన వ్యర్థ జలాల పారబోత కారణంగా మూగజీవాలు బలైపోతున్నాయి. దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ తండా–2 డంపింగ్‌యార్డు సమీపంలో కొన్ని రోజులుగా రసాయనాలను ఇష్టానుసారంగా డంపింగ్ చేస్తున్నారు. తండా నివాసి రైతు కొర్ర రాములుకు చెందిన రెండు ఆవులు స్థానికంగా రసాయనాలు కలిసిన గడ్డిని మేశాయి. దీంతో తీవ్ర అవస్థతకు గురై మృత్యువాత పడ్డాయి. ఆవుల యజమాని కొర్ర రాములు మాట్లాడుతూ.. పీసీబీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వచ్చి శ్యాంపిల్ తీసుకొని వెళ్తున్నారే తప్ప రసాయనాలను పారబోస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. చనిపోయిన ఆవులకు ఎవరు నష్టపరిహారం చెల్లిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.


మృతి చెందిన ఆవు

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

దుండిగల్: కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష మంగళవారం మూడో రోజుకు చేరుకుంది. దుండిగల్‌లోని చర్చిగాగిల్లాపూర్‌లో హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర పటేల్, బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ నేత ఆమరణ దీక్ష చేస్తున్నారు. మంగళవారం దీక్ష శిబిరాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య సందర్శించి సంఘీభావం ప్రకటించారు.ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే కుల గణన చేపట్టాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్లను నెరవేర్చని పక్షంలో బీసీ విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు నిరసనలకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, రాష్ట్ర ఇన్‌చార్జి కేవీగౌడ్, బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్, వర్కర్స్ పార్టీ అధ్యక్షుడు రాయబండి పాండురంగా చారి, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కోట్ల వాసుదేవ్ పటేల్, హిందూ బీసీ ఆజాది సంగ్ అధ్యక్షుడు దేశం మహేష్ గౌడ్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుబ్బకోటి ఆంజనేయులు ముదిరాజ్, జనరల్ సెక్రెటరీ చింతలగారి వెంకటస్వామి తదితరులు మద్దతు ప్రకటించారు.


దీక్షా శిబిరంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

క్రీడలతో మానసిక ఉల్లాసం


మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్‌లు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీసీపీ సురేష్‌కుమార్

నిజాంపేట్: క్రీడలతో స్నేహ బాంధవ్యాలు బలపడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ అన్నారు. బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే బాలానగర్ డీసీపీ జోన్ వాలీబాల్ పోటీలను మంగళవారం డీసీపీ సురేష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బాలానగర్ డీసీపీ పరిధిలోని 8 పోలీస్‌స్టేషన్లకు పరిధిలో 40 టీమ్‌లు ఈ టోర్నమెంట్‌లో పోటీ పడుతున్నాయి. స్పోర్ట్ అకాడమీ ఆఫ్ తెలంగాణ గర్ల్స్, సరూర్‌నగర్ స్పోర్ట్స్ అకాడమీ జట్లు సైతం టోర్నమెంట్‌లో ఆడనున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏసీపీలు పి.సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, జి.హన్మంతరావు, ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

కుత్బుల్లాపూర్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ సంజీవయ్యనగర్ కాలనీలో మంగళవారం శ్రీనల్లపోచమ్మ ఆలయ సప్తమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో తరలివచ్చి అమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లపోచమ్మ కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి

సుభాష్‌నగర్: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. మంగళవారం బతుకమ్మబండలో నారాయణ ఆస్పత్రి సౌజన్యంతో బస్తీ అధ్యక్షుడు చెట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శేషగిరి వైద్య శిబిరాన్ని ప్రారంభించి పలువురికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి మురళీ కృష్ణ, వెంకట్, లక్ష్మణ్, శివప్ప, దేవేందర్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

'డబుల్' గ్రూపులు.!

- రెండు గ్రూపులుగా విడిపోయిన డబుల్ బెడ్రూమ్ లబ్ధిదారులు
- గొడవలు జరగకుండా దుండిగల్ పోలీసుల భారీ బందోబస్తు
- లబ్ధిదారులను సముదాయించిన కౌన్సిలర్ కృష్ణయాదవ్


కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

దుండిగల్: దుండిగల్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో రెండు అసోసియేషన్లు ఏర్పడ్డాయి. లబ్ధిదారులు రెండు అసోసియేషన్లుగా విడిపోయారు. కొన్ని రోజులుగా డబుల్ ఇళ్ల సముదాయంలో మెయింటనెన్స్ విషయంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వాట్సాప్ గ్రూపులు, ఫోన్లు చేసుకోవడంతో లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఒకానొక దశలో గొడవలు జరుగుతాయని ముందస్తు సమాచారంతో దుండిగల్ పోలీసులు అక్కడికి చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు.

అసలు విషయం ఇదీ...

సెక్యూరిటీ గార్డుల ఏర్పాటు, లిఫ్ట్, మంచి నీటి సదుపాయం, వీధి లైట్లు, డ్రైనేజీ వ్యవస్థ తదితర సమస్యలపై మెయింటెన్స్ కోసం ప్రతి ఇంటికి రూ.200 వసూలు చేయాలనే సదుద్దేశంతో ఓ అసోసియేషన్ నిర్ణయానికి వచ్చింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మరో అసోసియేషన్ ఆరోపణలు చేస్తూ నిరసన తెలిపారు.

లబ్ధిదారులను సముదాయించిన కౌన్సిలర్

విషయం తెలుసుకుని ఈ సమావేశానికి కౌన్సిలర్ జక్కుల కృష్ణయాదవ్ హాజరై లబ్ధిదారులను సముదాయించారు. లబ్ధిదారులు గొడవలు పడకుండా సమన్వయంతో వ్యవహరించాలన్నారు. బేదాభిప్రాయాలకు తావు లేకుండా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. తన సొంత ఖర్చులతో ఒక నెల వరకు ఇద్దరు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయిస్తానని కౌన్సిలర్ హామీ ఇచ్చారు.

ప్రతి బ్లాక్‌కు సొసైటీ కమిటీలు ఏర్పాటు చేసుకోండి..

ప్రతి ఒక్క బ్లాక్‌కు సొసైటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొత్తగా బ్లాక్‌ల వారీగా ఏర్పాటైన కమిటీల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఇతర మౌలిక సదుపాయాలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అమరం గోపాల్‌రెడ్డి, జక్కుల శ్రీనివాస్‌యాదవ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


హాజరైన లబ్ధిదారులు

కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు



కుత్బుల్లాపూర్: పేట్ బషీరాబాద్ కట్టమైసమ్మ ఆలయంలో శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం అభిషేకం నిర్వహించిన అన్నదాతలు ధర్మారెడ్డి కుటుంబ సభ్యులు పూజలు చేసి మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్‌రెడ్డి, శైలజ దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్పోర్ట్స్ మీట్

చింతల్: డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ ఆధ్వర్యంలో 18వ రాజీవ్ గాంధీ మెమోరియల్ ఎన్ఎస్‌యూఐ స్పోర్ట్స్ మీట్ రెండో రోజు కొనసాగింది. అందులో భాగంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని పలు కళాశాలల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కందడి శివారెడ్డి, సుదర్శన్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి సాయికిరణ్, విశ్వ, నవీన్, అనూప్, కిరణ్, చిన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.


స్పోర్ట్స్ మీట్‌లో ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ నాయకులు

దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తా

దుండిగల్: దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ డి పోచంపల్లి చంద్రశేఖర్‌రెడ్డినగర్‌లోని ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం మొదటి వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని శ్రీశైలంగౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ సాయి యాదవ్, పరశురాంగౌడ్, బుచ్చిరెడ్డి, మోటె శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


పూజలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి


మురుగు సమస్యపై జీఎం అశోక్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: సూరారం కాలనీ రామలీలా మైదానం సమీపంలో మురుగు ప్రవాహంపై మంగళవారం బీజేపీ సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కందిశ్రీరాములు జలమండలి జీఎం అశోక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ... కొన్ని రోజులుగా రామలీలా మైదానం సమీపంలోని మార్కెట్, ప్రధాన రోడ్లపై మురుగు ఏరులై పారుతోందన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తూతూ మంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. ఈ రోడ్డు గుండా నిత్యం వివిధ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, స్థానికంగా కూరగాయల మార్కెట్‌కు కొనుగోలుదారులు వస్తుంటారని అన్నారు. తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల ఉధృతి పెరిగిందన్నారు. అధికారులు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టి మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలని కోరారు. దీనిపై స్పందించిన జీఎం అశోక్ సంబంధిత సెక్షన్ ఏఈని తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గొట్టుముక్కల సత్యనారాయణరాజు, డివిజన్ ఉపాధ్యక్షుడు పోల్కం విఘ్నేష్ ముదిరాజ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి శాంపురి విజయేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

29న 'నయా ఉత్సవ్ - నయీ చేతన'

నిజాంపేట్: బాచుపల్లిలోని జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఈనెల 29న 'నయా ఉత్సవ్ – నయీ చేతన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల నయా ఉత్సవ్ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి దోహద పడనుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఫ్లూట్ మేకింగ్, క్రౌన్ మేకింగ్, భక్తి గీతాలు, కథలు, కలర్ ద కృష్ణ, రాఖీ మేకింగ్, పాట్ పెయింటింగ్ వంటివి ఉంటాయన్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు తమ వెంట వస్తు సామగ్రిని తెచ్చుకోవాలని కోరారు. కాల్ రిజిస్టర్ చేసుకోవడానికి ఫోన్ నం.99853 40022 /040-40281916లో సంప్రదించాలన్నారు.

రోడ్లు అధ్వానం.. పట్టించుకోవడంలో నిర్లక్ష్యం

కుత్బుల్లాపూర్: జీహెచ్ఎంసీ పరిధిలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఏళ్ల తరబడి సీసీ రోడ్లకు నోచుకోకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు బురదమయంగా తయారయ్యాయి.. జీడిమెట్ల డివిజన్ అంగడిపేట్‌లోని ఓ రోడ్డు పల్లెటూళ్లల్లో కంటే అధ్వాన్నంగా మారింది.. వర్షాలకు రోడ్డంతా బురదగా మారడంతో వాహనదారులు జారి పడి గాయల పాలవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు తమ ప్రాంతానికి సీసీ రోడ్లను మంజూరు చేసి సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.


అంగడిపేటలోని ఓ రోడ్డు..

హైడ్రాతో ఆక్రమణదారుల్లో భయం

పంజగుట్ట: హైడ్రా ఏర్పాటుతో ఆక్రమణదారుల్లో భయం మొదలైందని, రాష్ట్రంలో ఆక్రమణకు గురైన వక్ఫ్, దేవాదాయ భూములు స్వాధీనం చేసుకునే బాధ్యతను హైడ్రాకు అప్పగించాలని ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా.ఎండీ ఇస్లాముద్దీన్ మాట్లాడుతూ వేలాది ఎకరాలు రాజకీయ నాయకులు, బడాబాబులు కబ్జాలు చేశారని ఆరోపించారు. హైడ్రా వాటిని స్వాధీనం చేసుకుంటున్న తీరును తాము స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఆంధ్రా పాలకులు వక్ఫ్ ఆస్తులు కాజేశారని ఆరోపించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దలు వారే వేల ఎకరాలు కబ్జా చేశారన్నారు. చెరువుల ఆక్రమణలు తొలగిస్తున్న తరుణంలో ఓవైసీ సోదరులు భయంతో ముందు హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న ప్రభుత్వ కట్టడాలు తొలగించాలని మాట్లాడటం గమనిస్తే చెరువులో వారు నిర్మాణాలు కట్టామని ఒప్పుకున్నట్లే అన్నారు. చెరువుల ఆక్రమణల విషయంలో సొంత పార్టీ వారినే వదలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీరి ఆక్రమణల నుంచి చెరువులను కాపాడతారని తమకు నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ భూములు, దేవాదాయ భూములు వేల ఎకరాల్లో ఆక్రమణల్లో ఉన్నాయని వాటిని స్వాధీనం చేసుకునే బాధ్యతను హైడ్రాకు అప్పగిస్తే ముస్లిం సమాజం మొత్తం హైడ్రాకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

జలమండలి అధికారుల నిర్లక్ష్యం!


ఇన్‌సెట్‌లో రోడ్డుపైకి వచ్చిన తాగునీటి వాల్వ్
షాపూర్‌నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలోని గాజులరామారం రోడ్డులో ప్రమాదంగా ఉన్న వాల్వ్

రంగారెడ్డినగర్: జలమండలి అధికారుల నిర్లక్ష్య వైఖరి వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. మ్యాన్‌హోళ్ల నిర్వహణ, ఏర్పాట్లపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... షాపూర్‌నగర్ వాటర్ ట్యాంక్ దాటిన తరువాత గాజులరామారం వెళ్లే రోడ్డుపైనే ఇటీవల మంజీర నీటి వాల్వ్‌ను ఏర్పాటు చేశారు. వాల్వ్‌కు సంబంధించిన పైపు రోడ్డు మీదికి రావడంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు మార్గంలో వాల్వ్‌ను రోడ్డు మీదనే ఏర్పాటు చేయడంతో వేగంగా వచ్చే వాహనదారులు దాన్ని గుర్తించి గాయల పాలవుతున్నారు. ఇక రాత్రి వేళ్లలో వాహనదారులు ఇబ్బందులు చెప్పనక్కర్లేదు. ఏదైనా ప్రదేశంలో నీటి వాల్వ్‌ను ఏర్పాటుచేసే సమయంలో సంబంధిత సెక్షన్ అధికారి దగ్గరుండి పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. కాని షాపూర్‌నగర్ సబ్ డివిజన్ అధికారులు అంతా కాంట్రాక్టర్లపైనే వదిలేస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వాల్వ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాల్వ్ రోడ్డుపైకి వచ్చిన ప్రాంతంలో మూతను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి
- గణేష్ ఉత్సవ నిర్వాహకులతో సమావేశం
- పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

కుత్బుల్లాపూర్: గణేష్ ఉత్సవ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయకూడదని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ అనుమతి తీసుకున్న తర్వాతనే మండపం ఏర్పాటు చేయాలన్నారు. అందుకు తగ్గట్టుగా తాము బందోబస్తు ఏర్పాట్లను చూసుకుంటామని తెలిపారు. పేట్‌బషీరాబాద్ సమీపంలో ఉన్న ఎస్పీజీ గ్రాండ్‌లో మంగళవారం నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో పలు సూచనలు చేశారు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐలు, గ్రేటర్ అధికారులు, ఎలక్ట్రికల్, ఇరిగేషన్, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, గణేష్ మండప నిర్వాహకులు పాల్గొన్న ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

◆ ప్రతి ఒక్కరూ మండపం అనుమతి తీసుకొని ఎన్ని రోజుల్లో నిమజ్జనం చేస్తున్నారన్న విషయాన్ని స్పష్టంగా తెలపాలన్నారు. విద్యుత్ వినియోగం అక్రమ మార్గంలో తీసుకోవద్దన్నారు. కొన్ని ప్రాంతాల్లో గతంలో ఇదే తరహాలో విద్యుత్ సరఫరాను తీసుకోగా ప్రమాదాలు చోటుచేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. మేడ్చల్ ఏసీపీ పరిధిలో మేడ్చల్, సూరారం, దుండిగల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగే నిమజ్జన కార్యక్రమాలు, పేట్‌బషీరాబాద్ ఏసీపీ పరిధిలోని శామీర్‌పేట్, అల్వాల్, జినోమ్ వ్యాలీ, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు రూట్ మ్యాప్ తయారు చేసుకొని సిద్ధంగా ఉండాలని డీసీపీ సూచించారు.


గణేష్ మండప నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న డీసీపీ కోటిరెడ్డి


సమావేశానికి హాజరైన గణేష్ మండప నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది

సేవాలాల్ సేన కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామచంద్రనాయక్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లికి చెందిన సభావాత్ రామచంద్రనాయక్ సేవాలాల్ సేన కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర త్రిసభ్య కమిటీతో పాటు వివిధ జిల్లా సేవాలాల్ సేన కమిటీలను ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామలో జరిగిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడిగా కేతావత్ సుధాకర్ నాయక్, మాలోతు సునీతనాయక్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా నియమించారు. ఈ సందర్భంగా రామచంద్రనాయక్ మాట్లాడుతూ.. బంజారా కులస్తులు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించేందుకు 15 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నానని అన్నారు. తన సేవలను గుర్తించి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాలాల్ సేన అధ్యక్షుడు రాంబాబు నాయక్, త్రిసభ్య కమిటీ సభ్యులు చిన్నబాబు నాయక్, ప్రేమ్‌చంద్ నాయక్, సేవలాల్ సేన సంస్కృతిక జాతీయ అధ్యక్షుడు, బంజారా ఆదికవి డాక్టర్ ఎస్పీ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత నాయక్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ నాయక్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న రామచంద్రనాయక్